సాక్షి
అనంతపురం
ఆదివారం | 9 | జూన్ | 2024



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



ఇంటి నుంచే పవర్

ఇంటి వద్దనే కరెంటు ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం తీసుకొచ్చింది. 8లో

గరిష్టం/కనిష్టం
34.6°/22.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆర్బీకేలో ఫర్నీచర్ ధ్వంసం



ఆర్బీకేలో ధ్వంసమైన ఫర్నీచర్

ఉరవకొండ (విడపనకల్లు): విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు జగనన్న లేఅవుట్ వద్ద నిర్మించిన రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే)లో గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కార్యాలయంలోని ఫైళ్లను చెల్లాచెదురుగా విసిరేశారు. కార్యాలయ కిటికీ అద్దాలను పగులగొట్టారు. పలు పేపర్లు, ఫైళ్లు కాల్చి పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. శనివారం ఉదయం విషయాన్ని గుర్తించిన ఆర్బీకే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధుల్ని సక్రమంగా నిర్వర్తించాలి

పెద్దవడుగూరు: విధుల్ని సక్రమంగా నిర్వర్తించాలని డీఐజీ డాక్టర్ షిమోషి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వాటిని సరిగా నిర్వహించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ మృతి



అమరనాథ్ (ఫైల్)

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన అమరనాథ్ (36) పామిడి మండలంలోని కత్రిమల వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, రెండేళ్ల చిన్నారి ఉన్నారు. శనివారం ఏదో పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో పామిడి వచ్చిన ఆయన తిరిగి స్వగ్రామం బయలుదేరారు. ఈ క్రమంలోనే కల్లూరు వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలేరో, అమరనాథ్ బైకు ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్ర గాయాలైన వీఆర్‌ఓ ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. బొలేరో బోల్తా పడడంతో అందులోని ఐదుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికులు వారిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి, అమరనాథ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లోకి పాము



పామును పట్టుకున్న రాజు

శింగనమల: శింగనమల పోలీస్‌స్టేషన్‌లోకి శనివారం మధ్యాహ్నం పాము చొరబడింది. సిబ్బంది భయంతో బయటకు వచ్చేశారు. ఎంత సేపటికీ స్టేషన్‌లో నుంచి బయటకు రాకపోవడంతో పాములు పట్టే రాజును పిలిపించారు. రాజు పామును చాకచక్యంగా పట్టుకొని, కొండల్లోకి వదిలేశారు.

అమాత్య ఆశల పల్లకీలో..

సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచారు. ఇక ఇప్పుడు అందరి కన్నూ చంద్రబాబు మంత్రి వర్గ కూర్పుపై పడింది. అమాత్య పదవి కోసం ఉమ్మడి జిల్లాలోని పలువురు నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కంటే తమకంటూ అప్పుడే ఆశల పల్లకీలో ఊరేగుతున్నట్లు సమాచారం.

- మంత్రి పదవులపై ఊహాగానాలు
- బలంగా వినిపిస్తున్న పయ్యావుల, పరిటాల, కాలవ పేర్లు
- బీజేపీ నుంచి సత్యకుమార్‌కు మంత్రి పదవి వరిస్తుందని చర్చ
- అమాత్యా అనిపించుకోవాలని ఎవరికి వారు ప్రయత్నాలు



ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పయ్యావుల కేశవ్, అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు, సత్యకుమార్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో త్వరలో 'కూటమి' ప్రభుత్వం ఏర్పాటు కానుంది. సీఎంగా చంద్రబాబు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయోననే అంశం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. సీనియర్లయిన తమకే మంత్రి పదవి వరిస్తుందని కొందరు తమ కార్యకర్తలతో చెబుతుండగా, సామాజిక సమీకరణల్లో భాగంగా తమకూ వచ్చే అవకాశం ఉందని రిజర్వుడు నియోజకవర్గ అభ్యర్థులు ఆశాభావంతో ఉన్నారు.

ముగ్గురి పేర్లు బలంగా..

ఈ నెల 4న వెలువడిన ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు జయ కేతనం ఎగరేశారు. రెండు జిల్లాల్లోనూ టీడీపీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మంత్రి పదవుల కోసం ఆశావహుల జాబితా పెరిగిపోతోంది. మంత్రి పదవి కోసం ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే, రేసులో ముగ్గురు ముందంజలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మంత్రి పదవి రేసులో ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే నాలుగు దఫాలు ఆయన ఎమ్మెల్యే అయ్యారు. గతంలో ఆయన గెలిచినా రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడూ కేశవ్‌కు మంత్రి పదవి రాలేదు. అయితే, ఈ దఫా ఎమ్మెల్యేగా గెలవడం, టీడీపీనే ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో ఆయనకు కలిసిరానున్నట్లు తెలిసింది. 2014లో మంత్రిగా పని చేసిన పరిటాల సునీత కూడా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గెలిచిన నలుగురు మహిళల్లో సునీతనే సీనియర్ ఎమ్మెల్యే. కాబట్టి మహిళా కోటాలో తనకే దక్కుతుందన్న ఆశతో ఆమె ఉన్నారు. వీరిద్దరితో పాటు రాయదుర్గం నుంచి గెలిచిన కాలవ శ్రీనివాసులు మంత్రి పదవి వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. గతంలో కాలవ మంత్రిగా పనిచేశారు. బీసీ సామాజిక వర్గ కోటాలో కచ్చితంగా కాలవకే మంత్రి పదవి వస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇక.. తొలిసారిగా కళ్యాణదుర్గం నుంచి టీడీపీ తరఫున బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు కూడా మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆశీస్సులు తీసుకున్నారు. హస్తినలో పలువురు టీడీపీ పెద్దలతో పాటు బీజేపీ పెద్దల ఆశీర్వాదం కోసం మకాం వేసినట్లు జోరుగా చర్చ సాగుతోంది.

సత్యకుమార్‌కు పక్కా!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీజేపీ నుంచి ఒక్కరే గెలుపొందారు. ధర్మవరం నుంచి సత్యకుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈయనకు బీజేపీ కేంద్ర పెద్దల్లో మంచి పలుకుబడి ఉందని, దీంతో సత్యకుమార్ కచ్చితంగా మంత్రి అయ్యే అవకాశముందని అనుచరులు చెబుతున్నారు. ఒక వేళ సత్యకుమార్‌కు మంత్రి పదవి ఇస్తే గనుక టీడీపీ నుంచి ఒక్కరికే అవకాశం ఉంటుంది. సత్య కుమార్‌కు ఇవ్వకపోతే ఇద్దరికి అవకాశం ఉంది. ఆ ఇద్దరూ ఎవరో త్వరలో తేలిపోనుంది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు మంత్రి పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్

రాయదుర్గంటౌన్: డయేరియా, విష జ్వరాలతో ఆస్పత్రిపాలై చికిత్స పొందుతున్న రాయదుర్గం పట్టణంలోని అరబిక్ కళాశాల మదరసా విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ వైద్యులకు సూచించారు. దాదాపు 58 మంది విద్యార్థులు వైరల్ ఫీవర్, వాంతులు, విరేచనాలతో శుక్రవారం రాత్రి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చేరారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆరోగ్యం బాగా ఉన్న 41 మంది విద్యార్థులను పంపించి 17 మందిని అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందజేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి విచ్చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వైద్యాధికారి మాధవి, ఉమామహేశ్వర్, ఇతర వైద్య బృందం, సిబ్బందితో కలిసి వార్డుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రిలో విద్యార్థులు కోలుకుంటున్నట్లు చెప్పారు. ఎవరికి ఎలాంటి అపాయం లేదన్నారు. కళాశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎక్కడా నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని అరబిక్ కళాశాల యాజమాన్యానికి సూచించారు. భోజన నాణ్యతపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

116 మంది 'డిపాజిట్లు' గల్లంతు

- పార్లమెంట్ బరిలోని 19 మందికి 83,834 ఓట్లు
- అసెంబ్లీ బరిలోని 97 మందికి 71,414 ఓట్లు
- జాబితాలో జాతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు



ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు మినహా ఇతర అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. ఇందులో జాతీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన 134 మంది అభ్యర్థుల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు 18 మంది పోగా మిగిలిన 116 మంది అభ్యర్థులు డిపాజిట్ దక్కించుకునేందుకు సరిపడా ఓట్లను సాధించుకోలేకపోయారు. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన 21 మందిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు మినహా మిగిలిన 19 మందికి 83,834 ఓట్లు (5.86 శాతం), ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన 113 మందిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు మినహా మిగిలిన 97 మందికి కేవలం 71,414 ఓట్లు (4.31 శాతం) వచ్చాయి.

డిపాజిట్ అంటే...?

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ముందుగా కొంతమొత్తం ధరావతుగా చెల్లించాలి. దీనిని డిపాజిట్ అంటారు. పార్లమెంట్ నియోజకర్గానికి పోటీ చేయాలంటే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500, ఇతరులు రూ.25 వేలు డిపాజిట్ కట్టాల్సి ఉంటుంది. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే వారిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు డిపాజిట్ కట్టాలి.

ఓట్లు రాకుంటే డబ్బు పోయినట్లే..

మొత్తం పోలైన ఓట్లలో అభ్యర్థికి 6 శాతం ఓట్లు వచ్చినప్పుడే డిపాజిట్ దక్కుతుంది. ఈ క్రమంలో డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. సాధించలేని పక్షంలో డిపాజిట్‌ను అభ్యర్థులు కోల్పోతారు.

116 మందికి నిరాశే..

సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 21 మంది, ఎనిమిది అసెంబ్లీ నియోజకర్గాలకు 113 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో 116 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు.

- పార్లమెంట్ నియోజకవర్గం (రాప్తాడు మినహా ఏడు నియోజకవర్గాలు) పరిధిలో 14,31,229 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులకు (ఇద్దరు) 13,47,395 ఓట్లు వచ్చాయి. మిగిలిన 19 మంది (జాతీయ పార్టీల, స్వతంత్ర) అభ్యర్థులకు 83,834 ఓట్లు (5.86 శాతం) ఓట్లు వచ్చాయి. ఈ 19 మందిలో ఏ ఒక్కరూ పోలైన ఓట్లలో 6 శాతం ఓట్లను సాధించలేదు.
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,58,858 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులకు (16 మంది) 15,87,444 ఓట్లు వచ్చాయి. మిగిలిన 97 మంది (జాతీయ పార్టీల, స్వతంత్ర) అభ్యర్థులకు 71,414 ఓట్లు (4.31 శాతం) వచ్చాయి. ఈ 97 మందిలో ఏ ఒక్కరూ పోలైన ఓట్లలో 6 శాతం ఓట్లను సాధించలేదు.

అసెంబ్లీ నియోజకవర్గాల్లో..

నియోజకవర్గం	పోటీ చేసిన అభ్యర్థులు	పోలైన ఓట్లు	టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	ఇతర అభ్యర్థులు, (వారికి వచ్చిన ఓట్లు)	ఇతరులకు ఓట్ల శాతం
రాయదుర్గం	13	2,28,281	2,18,959	11(9,322)	4.08
ఉరవకొండ	11	1,94,544	1,82,388	9(12,156)	6.24
గుంతకల్లు	14	2,06,731	1,96,574	12(10,157)	4.91
తాడిపత్రి	18	2,08,008	1,99,779	16(8,229)	3.95
శింగనమల	14	2,08,245	1,97,126	12(11,119)	5.33
అనంతపురం	15	1,89,874	1,83,645	13(6,229)	3.28
కళ్యాణదుర్గం	15	2,06,018	2,00,022	13(5,996)	2.91
రాప్తాడు	13	2,17,157	2,08,951	11(8,206)	3.77
మొత్తం	113	16,58,858	15,87,444	97(71,414)	4.31

పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థులు	21
పోలైన ఓట్లు (ఏడు నియోజకవర్గాలు)	14,31,229
టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	13,47,395
మిగిలిన 19 మంది అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	83,834

అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థుల సంఖ్య	113
పోలైన ఓట్లు (ఎనిమిది నియోజకవర్గాలు)	16,58,858
టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	15,87,444
మిగిలిన 97 మంది అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	71,414


ప్రకృతి సాగు పరిశీలనకు విదేశీ బృందం



జాంబియా దేశానికి చెందిన బృందంతో సమావేశమైన సీటీఐఓ లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్‌గా మారిన ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు మరో విదేశీ బృందం చేరుకుంది. ఆఫ్రికా ఖండానికి చెందిన జాంబియా దేశం నుంచి 16 మంది ప్రతినిధి బృందానికి ఈనెల 21వ తేదీ వరకు క్షేత్రస్థాయి పర్యటనతో ఈ తరహా వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్–ఏపీసీఎన్‌ఎఫ్) చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) లక్ష్మానాయక్ తెలిపారు. జిల్లాకు చేరుకున్న 16 మంది విదేశీ బృందంతో శనివారం స్థానిక ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జాంబియా వ్యవసాయ మంత్రిత్వశాఖ తరఫున సయామీస్ ముండియా, ఆ దేశానికి చెందిన కస్సీ వ్యవసాయ శిక్షణా కేంద్రం (కేఏటీసీ), అలాగే వాల్ఫోనాస్కా శిక్షణా క్షేత్రం (వీఎల్‌ఎఫ్) చెందిన ఇరువురు శిక్షణాధికారులు క్లాస్ రెక్టెన్వాల్డ్, మోడెస్టర్ చనసాతో పాటు పలువురు అధికారులు, రైతులతో కూడిన 16 మంది బృందం జిల్లాకు చేరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 4,120 గ్రామాల్లో 10.35 లక్షల మంది రైతులు లక్షలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 249 క్లస్టర్ల పరిధిలో 76 వేల మందికి పైగా రైతులు 86 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రకృతి పద్ధతిలో పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లా పర్యటనకు దేశ విదేశాలకు చెందిన ప్రతినిధుల బృందాలు వస్తున్నాయన్నారు. ఇప్పటివరకు 45 దేశాల నుంచి ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రిసోర్స్ సంస్థగా రైతుసాధికార సంస్థ పనిచేస్తోందన్నారు. సోమవారం నుంచి జాంబియా ప్రతినిధి బృందం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి క్షేత్రాలను సందర్శించి, రైతుల అనుభవాలు తెలుసుకోనున్నట్లు తెలిపారు.

నెట్టికంటి ఆంజనేయుడిని దర్శించుకుంటున్న భక్తులు



కసాపురంలో భక్తుల సందడి

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండడం, రెండో శనివారం కావడంతో వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామునే మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి, బంగారు కవచంతో విశేష పుష్పాలంకరణ గావించి, వడమాల, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజాలు చేశారు.

నమో నారసింహ..



భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా పల్లకీ సేవ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో నెలపూజ కోసం భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహున్ని కొలువు దీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెన్నహోబిలంలో శ్రీవారి పల్లకీ సేవ

కొనసాగుతున్న వర్షాలు

- పెద్దవడుగూరులో 64.4 మి.మీ భారీ వర్షం
- 26 మండలాల పరిధిలో 11.9 మి.మీ సగటు నమోదు
- రాగల మూడు రోజులూ వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాపై వరుణుడి కరుణ కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 26 మండలాల పరిధిలో 11.9 మి.మీ సగటు నమోదైంది. పెద్దవడుగూరు మండలంలో 64.4 మి.మీ భారీ వర్షం కురిసింది. అనంతపురం 29.2 మి.మీ, కళ్యాణదుర్గం 27.2 మి.మీ, ఆత్మకూరు 24 మి.మీ, బ్రహ్మసముద్రం 21 మి.మీ, బుక్కరాయసముద్రం 19.2 మి.మీ, కుందుర్పి 18.2 మి.మీ, కంబదూరు 17.2 మి.మీ, శింగనమల 17 మి.మీ, రాప్తాడు 16 మి.మీ, గుంతకల్లు 13.2 మి.మీ, కూడేరు 13 మి.మీ, పెద్దపప్పూరు 12.2 మి.మీ, డి.హీరేహాళ్ 12 మి.మీ, నార్పల 11.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటికే 93 మి.మీ నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కూడా పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా జిల్లా అంతటా వర్షాలు పడుతుండడంతో పంటల సాగును రైతులు మొదలు పెట్టారు. ఈనెల 15 నుంచి జూలై నెలంతా ఖరీఫ్ సాగుకు మంచి అదును అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాగల మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శనివారం విడుదల చేసిన బులెటిన్ తెలిపారు.

ఇంటి నుంచే పవర్

భవిష్యత్ విద్యుత్ అవసరాల దృష్ట్యా కేంద్రం సరికొత్త విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తోంది. సోలార్ విద్యుత్ తయారీకి సబ్సిడీ, రుణ సదుపాయం కల్పించింది. ఆసక్తిదారులు 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు.

- పీఎం సూర్యఘర్‌కు 632 దరఖాస్తులు
- సబ్సిడీతో పాటు రుణసదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకునే అవకాశం
- కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌తో నెలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి


ఇంటి పైకప్పుపై అమర్చిన సోలార్ ప్యానెల్

హిందూపురం అర్బన్: మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో 'నెట్ మీటర్' ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారు వాడుతున్న విద్యుత్‌ను లెక్కిస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 632 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు.

30 రోజుల్లో సబ్సిడీ..

నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారులు 'పోర్టల్' లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3-4 ప్యానల్స్ (1 మీటరు వెడల్పు - 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

పీఎం సూర్యఘర్ పథకం వివరాలిలా..

వినియోగం (యూనిట్లలో)	సోలార్ కెపాసిటీ (కిలోవాట్లలో)	సబ్సిడీ
0 - 150	1-2	రూ.30 వేల నుంచి రూ.60 వేలు
150 - 300	2 - 3	రూ.60 వేల నుంచి రూ.78 వేలు
300 లోపు	3	రూ.78 వేలు

ఇది మంచి పథకం



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే 'సూర్యఘర్' మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణసదుపాయం కల్పిస్తోంది. 6 -7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులతో నివృత్తి చేసుకోనే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– భూపతి, ఈఈ ట్రాన్స్‌కో, హిందూపురం

క్లుప్తంగా

భారీ వర్షానికి కొట్టుకుపోయిన గొర్రెలు


చనిపోయిన గొర్రెలు

ఉరవకొండ: భారీ వర్షానికి 20 గొర్రెలు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. వివరాల్లోకెళితే.. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన శ్రీనాథ్ 20 గొర్రెలను మేపడానికి శుక్రవారం సమీపంలోని కొండ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అదే రోజు రాత్రి భారీ వర్షం కురిసింది. వాగు దాటే సమయంలో గొర్రెలు ఒక్కొక్కటిగా గల్లంతయ్యాయి. రాత్రంతా గాలించినా గొర్రెలు దొరకలేదు. శనివారం పొలాల్లోకి కొట్టుకురావడంతో కాపరి శ్రీనాథ్ లబోదిబోమంటూ రోదించాడు. మొత్తం 20 గొర్రెల మృతి చెందడంతో రూ.3లక్షల దాకా నష్టం వాటిల్లిందని వాపోయాడు.

మూడు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. రంగనాయకస్వామి ఆయిల్ ట్రేడర్స్‌లో రూ.20వేలు, కమలనాథ్ గానుగ ఆయిల్ దుకాణంలో రూ.27 వేలు, రూపా మెడికల్స్‌లో రూ.3 వేలు చొప్పున ఎత్తుకుపోయారు. అయితే ఈ చోరీలపై ఎటువంటి ఫిర్యాదులూ అందలేదని తాడిపత్రి అర్బన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా


డైరెక్టర్ పదవికి రాజీనామా చేసిన శ్యామల

అనంతపురం కార్పొరేషన్: ఈడిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పదవికి శ్యామల రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆమె శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. తన విధులను గురుతర బాధ్యతగా నిర్వర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి


ఆర్డీటీ సెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత చదువులపై దిశానిర్దేశం చేస్తున్న విశాల ఫెర్రర్

- ఆర్డీటీ సెట్ ద్వారా ప్రతిభావంతులైన పేద పిల్లలకు చేయూత
- సమాజానికి పరిపూర్ణమైన వ్యక్తులను అందించడమే ధ్యేయం
- ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్

అనంతపురం: ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలని, అత్యున్నత స్థానాన్ని అధిరోహించే వరకు మొక్కవోని దీక్షతో ముందుకు సాగాలని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్, అనంతరం బీటెక్, ఎంబీబీఎస్ చదవడానికి అవసరమైన ఆర్థిక సాయానికి అర్హత సాధించిన విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని ఆర్డీటీ మెయిన్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశాల ఫెర్రర్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సమాజానికి పరిపూర్ణమైన వ్యక్తులను అందించే ఉద్దేశంతో ఆర్డీటీ విద్య, వైద్యం మెరుగుదలకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కింద ప్రతి ఏటా 365 మంది విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించేందుకు అయ్యే వ్యయాన్ని సంస్థ భరిస్తోందన్నారు. ఇప్పటి దాకా 5,287 మంది విద్యార్థులను ఈ పథకం ద్వారా ఆర్డీటీ చదివించిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న వారు ప్రతి నెలా రూ.80 కోట్లు ఆర్జిస్తున్నారని ప్రశంసించారు. మైక్రోసాఫ్ట్ వంటి ఉన్నత కంపెనీల్లో కొలువులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన మురళి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబానికి ఆర్డీటీ అండదండ



మా అమ్మా, నాన్న చనిపోయారు. చిన్నప్పటి నుంచి మా కుటుంబానికి ఆర్డీటీ అండగా నిలిచింది. మా అమ్మమ్మ, మా అన్న చేదోడువాదోడుగా ఉన్నారు. మా బంధువులు ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు. అలాంటి సమయంలో ఆర్డీటీ ముందుకొచ్చి మమ్మల్ని చదివిస్తోంది. ఇపుడు స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కింద ఎంపికయ్యాను. ఇలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఆర్డీటీకి జీవితకాలం రుణపడి ఉంటాం. ఉన్నత స్థానాన్ని చేరుకున్నాక ఆర్డీటీ తరుపున మరొకరిని చదివించే బాధ్యత తీసుకుంటాను. – జాహ్నవి, బత్తలపల్లి

ఆర్డీటీ స్ఫూర్తితో సేవ చేస్తా



ఆర్డీటీ సెట్ ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యనభ్యసించేందుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఇంత చక్కటి అవకాశం కల్పించిన ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌కు కృతజ్ఞతలు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఇంజినీరింగ్ విద్య పూర్తి చేస్తాను. ఇంజినీర్‌గా ఉన్నత స్థానాన్ని చేరుకుని పది మందికి సేవ చేయాలనే స్ఫూర్తిని ఆర్డీటీ నుంచి నేర్చుకున్నాను. – ఎస్.ఉదయగిరి, డోన్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అమరాపురం: మద్దనకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.... అమరాపురం దక్షిణగొల్లహట్టికి చెందిన సంతోష్ (28) తన స్నేహితుడు గోవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం కర్ణాటక రాష్ట్రం మద్దేహళ్లి గేట్‌కు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరుగుపయనమయ్యారు. మద్దనకుంట వంక సమీపంలో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గోవర్ధన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మడకశిర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హిందూపురం ఆస్పత్రిలో చేర్పించినట్లు బంధువులు తెలిపారు. సంతోష్‌కు వివాహం కాలేదు. తల్లిదండ్రులు ఉన్నారు.

టిప్పరు ఢీకొని జీవిత ఖైదీ మృతి

- మృతుడు ఎమ్మిగనూరు వాసి


జీవిత ఖైదీ వీరన్న మృతదేహం (ఇన్‌సెట్‌లో) వీరన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం: ఓపన్ ఎయిర్ జైలులో జీవిత ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వీరన్న (48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఓపన్ ఎయిర్ జైలు అధికారులు, బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన వీరన్నకు భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు పడింది. 2016 నుంచి రెడ్డిపల్లి వద్దనున్న ఆరుబయలు కారాగారం (ఓపన్ ఎయిర్ జైలు)లో శిక్ష అనుభవిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఓపన్ ఎయిర్ జైలు పొలం నుంచి తను ఉండే బ్యారక్‌కు సైకిల్‌పై వస్తుండగా జైలు సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద జంతులూరు నుంచి వస్తున్న ఎస్ఆర్ఎస్ కంపెనీకి చెందిన టిప్పరు ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పరు ఢీకొట్టి నిలపకుండా వేగంగా వెళ్లిపోయింది. వీరన్నకు ఒక కుమారుడు ఉన్నారు. రోడ్డు ప్రమాదంపై ఓపన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ రెహ్మాన్ బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మేయర్‌కు అవమానం

- ప్రొటోకాల్ మరచిన అధికారులు

అనంతపురం కార్పొరేషన్: ప్రొటోకాల్ విషయంలో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు అధికారులు రెడ్‌కార్పెట్ వేసి ఆహ్వానించారు. అయితే ప్రథమ పౌరుడు, నగర మేయర్ వసీంను అధికారులు సమావేశానికి పిలవకుండా అవమానపరిచారు. వాస్తవంగా నగరంలోని నడిమివంక, మరువవంకకు సంబంధించి ప్రజాప్రతినిధి, అధికారులతో చర్చ జరిగినప్పుడు మేయర్‌ను తప్పకుండా పిలవాల్సి ఉంది. కానీ అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాజీనామా


ఎల్‌ఎం ఉమాదేవిని సత్కరిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమకు పంపారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆమెను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

భలే రుచిగా ఉందే..


నాకూ కొంచెం ఇవ్వవూ..


అర్రె.. రుచిగానే ఉందే...


ఏమీ అనుకోకే.. నీకు మిగల్చలేదు


కూడేరు: మండల కేంద్రం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల ఆలయం వద్ద శనివారం ఓ రెండు వానరాలు గోడపైకి చేరాయి. అక్కడ ఆడుకునేందుకు వచ్చిన పిల్లల్లో ఒక చిన్నారి చేతిలో ఉన్న కూల్‌డ్రింక్ బాటిల్‌ను ఓ వానరం లాక్కుంది. అందులో ఏముందోనని వాసన చూసింది. వెంటనే మరొక వానరం ఆ బాటిల్ వైపు ఆశతో చూడసాగింది. దీంతో మొదటి వానరం కూల్‌డ్రింక్ కాస్త తాగగానే రుచిగా అనిపించడంతో గుటగుటా లాగించేసింది. తర్వాత ఖాళీ బాటిల్ చూపగా.. పక్కనున్న వానరం నిరాశతో పక్కకు వెళ్లిపోయింది. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

దేవాలయంలో చోరీ


మారెమ్మ దేవాలయం

పావగడ: రొప్పం గ్రామంలోని కంబదూరు మారెమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో దుండగులు ఆలయ తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అమ్మవారి మెడలోని బంగారు తాళి, నాగపడగలు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.2లక్షల దాకా ఉండొచ్చని ఆలయ సమితి పదాధికారి రాజేశ్ తెలిపారు. పావగడ పోలీసులు శనివారం ఉదయం దేవాలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ సురేష్ తెలిపారు.

సత్యసాయికి నృత్యనీరాజనం


సాయికుల్వంత్ హాలులో సాయిని కీర్తిస్తూ గీతాలు ఆలపిస్తున్న భక్తులు


సత్యసాయి సహస్ర నామార్చన చేస్తున్న భక్తులు


సాయిప్రేమ అనంత ప్రదర్శనలోని ఓ ఘట్టం


సంస్కృతి చాటిన చిన్నారుల ప్రదర్శన


సర్వమూ నీవే సాయీ అంటూ నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: బాలవికాస్ చిన్నారులు సత్యసాయికి నృత్య నీరాజనం సమర్పించారు. చక్కటి స్వరాలతో భక్తి గీతాలు ఆలపించి అందరినీ మైమరపింపజేశారు. 'సాయి ప్రేమ అనంత' పేరుతో అనంతపురం జిల్లాకు చెందిన 2,500 మంది సత్యసాయి భక్తులు శనివారం పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. తొలిరోజు సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 1,008 నామాలతో సత్యసాయి సహస్రనామార్చన చేశారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణతో భక్తిగీతాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనతో భక్తులు పరవశించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌లోకి ‘టయోటా టైసర్’



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని హర్ష టయోటా షోరూంలో అర్బన్ క్రూసర్ టైసర్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. శనివారం మేయర్ వసీం చేతుల మీదుగా కారును ఆవిష్కరించారు. ఈ కారు రెండు మోడల్స్‌లో అందుబాటులో ఉండగా.. 22.8 కిలోమీటర్లు మైలేజీ, ఎక్స్ షోరూం ధర రూ.7.73 లక్షలుగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, షోరూం జనరల్ మేనేజర్ గంగిరెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహబూబ్‌బాషా, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహిళా సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం సెంట్రల్: నగరంలో రాణీనగర్‌లో ఉన్న బహామీ బైతుల్ మాల్ షాదీ మహల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మహిళల సున్నీ ఇజ్‌తెమా నిర్వహిస్తున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇజ్‌తెమాలో ప్రసంగించడానికి మహిళ అల్లీమాలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ముస్లిం మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బంగారు తాపడం పనులకు విరాళం



ఆలయ ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు అనంతపురానికి చెందిన భక్తులు శనివారం రూ.1.20 లక్షల విరాళం అందజేశారు. అనంతపురానికి చెందిన జ్వాలాపురం శ్రీకాంత్ కుటుంబం శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ప్రాంగణంలోని డోనర్ సెల్‌లో బంగారు తాపడం పనులకు రూ.1.20 లక్షల విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఈఓ కే.ఎస్.రామరావు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేలకొరిగిన పురాతన వృక్షం



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద బళ్లారి–కళ్యాణదుర్గం అంతర్‌రాష్ట్ర రహదారిపై భారీ రావి వృక్షం నేలకొరిగింది. గాలీవానకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విరిగిపడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రావి చెట్టు వేర్లతో సహా రోడ్డుపై పడింది. దీంతో కళ్యాణదుర్గం–బళ్లారి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టును తొలగించే ప్రయత్నం ఎవరూ చేయకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు తొలగింపజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కూడేరు: మండలంలోని రామదుర్గం, బసాపురం, కూడేరులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తొలుత ఆంజనేయ స్వామి మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. తర్వాత స్వామిని వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బసాపురం, రామదుర్గం ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

సబ్సిడీపై కందులు

కూడేరు: మండల రైతులు సబ్సిడీ కందులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు ఎల్‌ఆర్‌జీ–52 రకం కందులు 50 క్వింటాళ్లు చేరినట్లు ఏఓ తెలిపారు. ఒక బ్యాగులో 4 కేజీల కందులు ఉంటాయని, సబ్సిడీ పోనూ రైతు రూ.392 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తన కందులు కావాల్సిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సూచించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన

రాప్తాడు: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని.. దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెడల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24, బీ–24 అని ఉంటే.. ఆ సిలిండర్ 2024 మార్చికి ఎక్స్‌పైర్డ్ అవుతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు


సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని . గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోదారుడికి ఉంది.

సిలిండర్‌కు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేక మైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుడి హక్కులు

- గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి.
- గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.



సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ (డీ-25)

భక్తిశ్రద్ధలతో దుర్గాసూక్త పారాయణం



యల్లమ్మ దేవతకు పూజలు చేస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని జీసస్ నగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ తల్లి విశేష పూజలందుకుంటోంది. మూడు రోజులుగా సాగుతున్న ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 108 దుర్గాసూక్తములతో అమ్మవారిని భక్తులు ఆరాధించారు. లలిత సహస్రనామాలతో ఆలయం మార్మోగింది. అలాగే యల్లమ్మ తల్లికి అభిషేకం, చండీ, రుద్ర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు అమ్మవారికి నీరాజనాలర్పించారు. ఆదివారం ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా 108 శ్రీసూక్తములతో అభిషేకం, మహాపూర్ణాహుతి, మహా అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతాయి. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో కనగానపల్లి రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కనగానపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఒక యువకుడు వేగంగా వస్తున్నాడు. మామిళ్లపల్లి గ్రామానికి సమీపంలోకి రాగానే నర్సరీల వద్ద రోడ్డు పక్కన నిలిపిన మరో ద్విచక్ర వాహనంతో పాటు పక్కనే నిలబడి ఉన్న శోభా అనే మహిళను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శోభ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వరద నిర్వహణపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి
- వంకల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: ‘నగర పరిధిలో వరద నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. భారీ వర్షం వచ్చినప్పుడు వరద నీరు ఎక్కడి నుంచి ఎక్కడి వెళుతుంది. ఎక్కడ ప్రభావితం అవుతోంది. అనే దానిపై యుద్ధప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి.’ అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నగర పరిధిలోని నడిమి, మరువ వంకలు, డ్రైనేజీ వ్యవస్థపై నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వంకలో చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ హద్దుల్లో ఉన్న పంచాయతీలతో సమన్వయం చేసుకుని పని చేయాలని అధికారులకు సూచించారు. మునిసిపాలిటీల పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

ఫాంగింగ్ తప్పనిసరి..

వర్షకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఫాంగింగ్ చేయించాలని, ఈ ప్రక్రియను శానిటేషన్ కార్యదర్శులు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ చేయించాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓ పీవీవీఎస్ మూర్తి, నగర పాలక సంస్థ ఎస్ఈ రామోహన్‌రెడ్డి, డీఈఈ సూర్యనారాయణ, అదనపు కమిషనర్ హరిప్రసాద్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

వంకల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నడిమివంక, మరువవంకల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కోర్టు రోడ్డులో ఉన్న గుల్జార్‌పేటలో జరుగుతున్న ఫాగింగ్ పనులు, కృష్ణ ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న మరువవంక, సోమనాథ్ నగర్‌లోని నడిమివంక, తపోవనం వద్ద ఉన్న బైపాస్‌లోని కాలువను కలెక్టర్ పరిశీలించారు. వర్షం వచ్చినా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించాలని సూచించారు. పక్కా ప్రణాళిక రూపొందించుకుని పనులు చేయాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. ఫాగింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, పబ్లిక్ హెల్త్ డీఎస్ఈ రామమోహన్ రెడ్డి, నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, డీఈలు సుభాష్, రవీంద్రరెడ్డి, పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ చిన్నారి వైద్య ఖర్చులకు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. వివరాలు .. నగరంలోని 2వ రోడ్డులో నివసిస్తున్న దుర్గాప్రసాద్, ప్రీతి దంపతులకు 3 నెలల పాప ఉంది. దురదృష్టవశాత్తూ ఆ చిన్నారికి బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో పాటూ ఫిట్స్ వస్తున్నాయి. వైద్యం చేయించేందుకు డబ్బు లేకపోవడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి వెంటనే స్పందించారు. శనివారం చిన్నారి కుటుంబ సభ్యులను కలిశారు. రూ.75 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



బుద్ధ విహార్ పార్క్‌లో బుద్ధుడి విగ్రహం చుట్టూ నిలిచి ఉన్న నీరు



వాకింగ్ ట్రాక్, ప్రజలు కూర్చునే లాన్‌లో ఇలా..

వాకింగ్ ఎలా చేసేది?

నగరంలోని ఆదర్శ నగర్‌లో ఉన్న బుద్ధ విహార్ పార్క్‌లో వాకింగ్ చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పార్క్‌లో నీరు చేరింది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. తద్వారా స్థానికులు వాకింగ్ చేసుకునేందుకు వీల్లేకుండా పోయింది. ఇటీవల బుద్ధ విహార్ పార్క్ గోడలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. అయితే వర్షం కురిసినప్పుడు నీరు కాలువల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయలేదు. పార్క్‌లోని బుద్ధుడి విగ్రహం చుట్టూ, వాకింగ్ ట్రాక్, తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. నగరపాలక సంస్థ సిబ్బంది నీటిని తీసేసే ప్రయత్నం చేయడం లేదు. పర్యవేక్షణ కూడా చేయడం లేదు. ఏడీఏ లక్ష్మీప్రసన్న ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

– అనంతపురం కార్పొరేషన్:

అస్తవ్యస్తంగా సర్జికల్ వార్డు



ఎంఎస్-1, 2లోకి వచ్చిన వర్షపు నీటిని తుడుస్తున్న పారిశుధ్య కార్మికురాలు



సర్జికల్ వార్డులో పాత అల్మారా, అడ్డుగా వేసిన మంచాలు

- వార్డుల్లోకి చేరుతున్న వర్షపు నీరు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగానికి సంబంధించి ఎఫ్ఎస్–1, 2 వార్డుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. వార్డులోకే నీరు రావడంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు వెంటనే స్పందించారు. వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. కాగా సర్జికల్ విభాగంలోని వివిధ విభాగాల్లో సురక్షిత ప్రమాణాలు పాటించాల్సి ఉంది. వార్డు ఆరు బయటే పాత మంచాలు, అల్మార్లు ఉంచేస్తున్నారు. తద్వారా రోగులకు అసౌకర్యం కల్గుతోంది. సర్జికల్ వార్డులో ఎప్పటికప్పుడు సురక్షిత ప్రమాణాలు పాటిస్తేనే.. రోగులకు ఇన్‌ఫెక్షన్ శాతం తగ్గే అవకాశం ఉంటుంది. ఆ దిశగా సర్వజనాస్పత్రి ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రత్యామ్నాయ పంటలే మేలు



గత ఏడాది రాప్తాడు వద్ద సాగు చేసిన కొర్ర పంట (ఫైల్)

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా దృష్టి పెడుతున్నారు. ఇందులో ముఖ్యంగా కొర్ర, పెసర, జొన్న వంటి చిరు ధాన్యాల పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కనగానపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు కొర్ర పంటను సాగుచేసి మంచి దిగుబడులు సాధించారు. తక్కువ వర్షాలు వచ్చినా ఎట్టకు తట్టుకుని 90 రోజుల్లో కొర్ర పంట చేతికి వస్తుంది. ఈ కొర్ర పంట సాగుకు పెట్టుబడులు కూడా చాలా తక్కువ. ఎకరానికి రూ.5 వేల పెట్టుబడి కూడా రాదని, పంట సాగు చేసినప్పుడు విత్తనం, సేద్యం ఖర్చులకు కలపి రూ.3 వేల వరకు వస్తుందని రైతులు చెబుతున్నారు. తిరిగి పంటను తొలగించే సమయంలో కూలీల ఖర్చులు రూ.2 వేల వరకు వస్తాయి. ఈ పంట సాగుకు ఎకరానికి మూడు కేజీల విత్తనం సరిపోతుంది. ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదు. దీనికి అడవి పందులు, జింకల బెడద ఉండదు. పంట సాగు చేసిన తర్వాత కేవలం రెండు వర్షాలు పడినా మంచి దిగుబడి వస్తుంది. కలుపు మొక్కలు లేకుండా బాగా సేద్యం చేసుకొంటే ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి రావొచ్చు. మార్కెట్లో కొర్ర ధాన్యానికి క్వింటాల్ ధర కనీసం రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఉంటుంది. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.15,000 వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు, కూలీల ఖర్చుల పోనూ ఎకరానికి రూ.15,000 వరకు లాభం ఆర్జించొచ్చని రైతులు చెపుతున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవల్లి తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కళాశాల అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్లు చేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు అవకాశం ఉందన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు అధునాతన వసతులతో కూడిన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆంజనేయుడికి కుంభాభిషేకాలు



ఆలయంలో మహా సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని పాలికిలో వెలసిన సీతారామస్వామి సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం, సుందరకాండ యాగం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సీతారామస్వామి సమేత ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, పారాయణ హోమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ట, ప్రత్యేక హోమాలు ఏర్పాటు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడు సీతారామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం..

ఉత్సవాల్లో భాగంగా సీతారామ స్వామి ఆలయంలో ఆదివారం సీతారామ మహా పట్టాభిషేక మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరుగుతుందని సీతారామ హనుమద్ భక్త మండలి సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు

రాయదుర్గం(డి హీరేహాళ్): బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన ఎం.శ్రీధర్ అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శనివారం తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు వివరాలను ఎస్ఐ వెల్లడించారు. డీహీరేహాళ్ మండలం హెచ్.సిద్దాపురానికి చెందిన సువర్ణతో ఎం.శ్రీధర్‌కు గతేడాది వివాహమైంది. అప్పట్లో కట్న కానుకల కింద రూ.2.50 లక్షల నగదు, 10 తులాల బంగారం ఇచ్చారు. కొన్నాళ్లపాటు దాంపత్యం అన్యోన్యంగా సాగింది. సువర్ణను భర్త శ్రీధర్‌తోపాటు అత్త, మామ, బావ అదనపు కట్నం మరో రూ.2.50 లక్షల తీసుకురావాలని ఒత్తిడి తేవాలని, లేకపోతే విడాకులు ఇస్తామని బెదిరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. వివరాలు.. కియా పోలీసులు తెలిపిన మేరకు..బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కోతాస్ కాఫీ షాపు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. దీంతో వెంకటగిరిపాళ్యానికి చెందిన వడ్డీ గంగాధర్ అనే వృద్ధుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వృద్ధుడిని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు అనంతపురం తరలించారు.